సాక్షి
జోగులాంబ గద్వాల
శుక్రవారం । 14 । జూలై । 2023



ఇంటింటికో టులెట్ బోర్డు

అద్దెకు ఇళ్లు దొరకని జిల్లాల్లో నేడు ప్రతి ఇంటి ఎదుట టులెట్ బోర్డు కనిపిస్తుంది.

వివరాలు II లో ▸



పాలమూరులో భారీ వర్షం

పాలమూరులో గురువారం సాయంత్రం అరగంట పాటు భారీ వర్షం కురిసింది.

వివరాలు II లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 34.8 /23.7

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గద్వాల డీఎస్పీ బదిలీ



గద్వాల క్రైం: గద్వాల డీఎస్పీగా పనిచేస్తున్న రంగస్వామి సైబరాబాద్ పరిధిలోని షాద్‌నగర్ ఏసీపీగా బదిలీ చేస్తూ రాష్ట్ర పోలీసుశాఖ బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన 2021 ఆగస్టు 21న డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. రెండు సంవత్సరాల పాటు ఇక్కడి ప్రజలకు సేవలు అందించారు. గద్వాల డీఎస్పీగా ఎవరు రానున్నారనే విషయంపై త్వరలో తేలనుంది.

బీచుపల్లి బెటాలియన్ కమాండెంట్..



రాంప్రకాష్, కమాండెంట్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాష్ బదిలీ అయ్యారు. పదో బెటాలియన్ నుంచి ఆయనను నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో నల్గొండ జిల్లాలోని అన్నెపర్తి 12వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి సాంబయ్య ప్రభుత్వం నియమించింది.

ఐటీఐలో ప్రవేశాలు

గద్వాల: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2023–24, 2023–25 విద్యా సంవత్సరానికి ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సులలో రెండో విడత ప్రవేశాలకు ఈ నెల 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ డీజిల్ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్ నం.9110523925, 9885249516లకు సంప్రదించాలని కోరారు.

ఉత్తమ సేవలందించాలి

గద్వాల క్రైం: రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలను అందించాల్సిందిగా ప్రోగ్రాం అధికారిణి మాధుర్య అన్నారు. గురువారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నులిపురుగుల నిర్మూలనకు ప్రతి చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను అందజేయాలన్నారు. ఇది పిల్లల్లో రక్తహీనత నియంత్రణ, పోషకాహార ఉపయోగితను మెరుగుపరుస్తుందన్నారు. చిన్నారుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

మెరుగైన శిక్షణతో యువతకు ఉపాధి

గద్వాల అర్బన్: ఏ రంగాల్లోనైనా రాణించాలంటే ముందస్తుగా యువతకు శిక్షణ అవసరమని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ప్రియాంక అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిరుద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధి, శిక్షణ, నైపుణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంకల్ప్ పథకం ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీసీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ దుర్గారెడ్డి, సత్యనారాయణ, హర్ష, శిక్షకులు పాల్గొన్నారు.

అడుగంటిన జమ్ములమ్మ

రిజర్వాయర్‌లో తగినంత నీటి నిల్వ లేని వైనం



నీటి సరఫరా నిలిచిపోయిన జమ్ములమ్మ నీటిశుద్ధి కేంద్రం

- ఇంటెక్‌వెల్‌కు అందని నీరు
- జూరాల నీటి విడుదలపైనే ఆశలు
- జిల్లా కేంద్రంలో వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- అవస్థలు పడుతున్న ప్రజలు

గద్వాల మున్సిపాలిటీ వివరాలిలా..	
మొత్తం జనాభా	80వేలు
నివాసగృహాలు	14,878
నీటి అవసరం	8 ఎంఎల్‌డి
సరఫరా అవుతున్న నీరు	5.5 ఎంఎల్‌డి

గద్వాల: చెంతనే కృష్ణానది పారుతున్నా.. బిందెడు మంచినీరు పట్టుకోవడానికి రోజంతా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది గద్వాల పట్టణంలో నెలకొన్న దుస్థితి. చాలా ఏళ్ల తరువాత తొలిసారిగా వర్షాకాలంలో తాగునీటి ఇక్కట్లు ఏర్పడ్డాయి. దీంతో జనం అల్లాడుతున్నారు. ప్రస్తుతం మున్సిపల్ పట్టణ జనాభా 80వేలు. గతంలో నిర్మించిన కృష్ణా ఫిల్టర్‌బెడ్, జమ్ములమ్మ నీటి పథకాలే ప్రస్తుత మున్సిపాలిటీకీ ఆధారం.

నిలిచిన జమ్ములమ్మ నీటి పంపింగ్

దశాబ్దంన్నర క్రితం పట్టణంలోని సగభాగం ప్రజలకు తాగునీటిని అందించాలనే సదుద్దేశ్యంతో జమ్ములమ్మ ఫిల్టర్‌బెడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ పథకం పట్టణంలోని సుమారు 25వార్డుల పరిధిలోని పదివేల నివాస గృహాలకు తాగునీటి సరఫరా చేసున్నారు. ప్రస్తుతం గతంలో ఎన్నడూ లేని విధంగా జమ్ములమ్మ రిజర్వాయర్ పూర్తిగా వట్టిపోయింది. దీంతో పట్టణంలోని సుమారు 50వేల (70 శాతం) మందికి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గత వారం రోజుల నుంచి నీటి సరఫరాను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. రిజర్వాయర్‌లో తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో పాటు, నిల్వ ఉన్న నీరు పచ్చరంగులో ఉండటంతో తాగునీటికి ఉపయోగపడదనే ఉద్దేశ్యంతో నిలిపివేశారు. దీనికి తోడు బురద, రంగు మారిన నీటిని ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేయడానికి ఇబ్బందులు వస్తున్నాయి. కాగా జమ్ములమ్మ ఫిల్టర్‌బెడ్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసిన పీజేపీ క్యాంపు ఎదురుగా, ఆసుపత్రి వెనకాల, గంజిపేటలో ఏర్పాటు చేసిన మూడు పెద్ద ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి ఆయా ప్రాంతాల ప్రజలకు పూర్తిగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. 0.7 టీఎంసీల సామర్థ్యం ఉన్న జమ్ములమ్మ జర్వాయర్ ద్వారా నిత్యం పట్టణ ప్రజలకు 3 ఎంఎల్‌డి (మెట్రిక్ లీటర్ ఫర్ డైలీ) అందించాల్సి ఉంది. అయితే రిజర్వాయర్ పూర్తిగా వట్టిపోవడంతో 70శాతం పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి సమస్య ఇంత జఠిలంగా మారినా అటు పాలకపక్షం కానీ... ఇటు ప్రతిపక్షం కానీ ఎవరూ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కృష్ణా ఫిల్టర్‌బెడ్ నుంచి మాత్రమే నీటి సరఫరా జరుగుతుంది. అది కూడా పాత పట్టణంలోని కొన్ని నివాసాలకు మాత్రమే అరకొరగా సరఫరా అవుతుంది.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



జమ్ములమ్మ రిజర్వాయర్‌లో నీరు డెడ్ స్టోరేజ్‌కు చేరింది. దీంతో నీటిని సరఫరా చేయడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రజల నీటి అవసరాలను తీర్చడానికి మిషన్ భగీరథ ద్వారా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. ఆ దిశగా రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నాం. పీజేపీ నుంచి నీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులను కోరడం జరిగింది.

– నర్సింహా, కమిషనర్, గద్వాల

జూరాల నుంచి నీరు విడుదల చేస్తాం

జూరాల నుంచి జమ్ముల మ్మ రిజర్వాయర్‌కు తక్షణం నీటిని విడుదల చేయడాని కి ఆదేశాలు జారీ చేశాం. పట్టణ ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కాల్వకు నీటిని విడుదల చేస్తున్నాం. శుక్రవారం రాత్రి నాటికి రిజర్వాయర్‌కు జూరాల నీరు చేరుతుంది.

– శ్రీనివాసరావు, పీజేపీ ఎస్‌ఈ



జమ్ములమ్మ రిజర్వాయర్ ఇంటెక్‌వెల్ వద్ద నీరందని దుస్థితి

మిషన్ భగీరథ మీదనే భారం

ప్రస్తుతం నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు తాగునీటితో పాటు ఇతర అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా నీటిని సరాఫరా చేస్తున్నారు. అయితే చాలా కాలనీలలో పైపులైన్ పనులు పూర్తికాకపోవడంతో మిషన్ భగీరథ నీటిని పూర్తిస్థాయిలో అందించలేక పోతున్నారు. ఇప్పటికే గద్వాల పట్టణ శివారులో నిర్మించిన ట్యాంకులు, సంపుల్లోకి నీటిని తీసుకొని... అక్కడి నుంచి పాత పద్ధతిలోనే నీటిని సరఫరా చేస్తున్నారు. జమ్ములమ్మ ఫిల్టర్ బెడ్ నుంచి మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో, మిషన్ భగీరథ ద్వారా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. నీటి సరఫరా నిలిచిపోయిన కాలనీలకు మిషన్ భగీరథ ద్వారా రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తు కొంత వరకు సమస్యను తీర్చుతున్నారు. నీటి సమస్య జఠిలంగా ఉన్న 2, 3 వార్డుల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు మరి కొన్ని కాలనీలకు నీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



రాజోళిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అపూర్వచౌహాన్

రాజోళి: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని.. విద్యార్థులకు నాణ్యతలేని భోజనం అందిస్తే ఏజెన్సీని తొలగిస్తామని అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. గురువారం మండలంలోని పెద్ద దన్వాడ,పెద్ద తాండ్రపాడు గ్రామాల్లో పల్లె దవాఖానా నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసేందుకు వచ్చారు. ఈ మేరకు పరిశీలించిన స్థలంలో భవనం నిర్మించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందుబాటులో ఉంచే విధంగా ఈ పల్లె దవఖానాలను నిర్మించడం జరుగుతుందని, వీలైనంత త్వరగా నిర్మాణం ప్రారంభించాలని ఆదేశించారు.

వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం

అనంతరం మాన్‌దొడ్డి, రాజోళిలో పర్యటించిన ఆయన మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనుల్లో నాణ్యతను తగ్గకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని అన్నారు. పూర్తయిన పనులను పరిశీలించి, ఏయే పనులు చేశారో వివరాలు తెలుసుకున్నారు. రాజోళిలోని జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన వంట ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనంలో నాణ్యత కనిపించడం లేదని ఇలాంటి భోజనం అందిస్తే ఏజెన్సీని తొలగిస్తామన్నారు. బియ్యం కారణంగా నాణ్యతలో తేడాలు వచ్చాయని ఏజెన్సీ బదులివ్వగా, స్థానిక అధికారులు భోజనాన్ని తరుచూ పరిశీలించాలని ఏమైనా ఇబ్బందులు కనిపిస్తే వెంటనే ఏజెన్సీని రద్దు చేసి కొత్త ఏజెన్సీని తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందురావ్,డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ,ఆర్‌ఐ శ్రీనువాసులు,ఎంపీఓ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పనులు..!

- అయిజలో డివైడర్ నిర్మాణానికి రూ.5.50కోట్లు మంజూరు
- గడువు ముగిసినా పూర్తి కాని వైనం
- కొత్త బస్టాండ్ – రాయచూర్ రోడ్డులో అసంపూర్తిగానే..
- పాత బస్టాండ్ – పీహెచ్‌సీ రోడ్డులో ఆలస్యంగా ప్రారంభం
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



అయిజ మున్సిపాలిటీలో కొనసాగుతున్న డివైడర్ పనులు

అయిజ: పట్టణాన్ని సుందరీకరించాలని.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చేయాలని.. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.కోట్లతో అయిజ మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రధాన రోడ్డును విస్తరించి, రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి డివైడర్ మధ్యలో మొక్కలు నాటి, సెంటర్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల క్రితం రూ. 5.50 కోట్లు నిధులను మంజూరు చేసింది. కానీ, నిర్ణీత గడువు ముగిసినా పనులు పూర్తి కాకపోవడం, రోడ్డుపై ఏర్పడిన గుంతలు, రాత్రిళ్లు వెలగని విద్యుద్దీపాలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండు భాగాలుగా పనుల విభజన

రోడ్డు డివైడర్ పనులు రెండు భాగాలుగా విభజించారు. కొత్త బస్టాండ్ నుంచి రాయిచూర్–కర్నూల్ టీ రోడ్డు వరకు ఒక భాగం కాగా రూ. 3 కోట్లు కేటాయించారు. పాత బస్టాండ్ చౌరస్తా నుంచి ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు రెండవ భాగంగా చేసి దానికి రూ. 2.50 కోట్లు కేటాయించారు. 2022 ఆగస్టులో కాంట్రాక్టర్లతో అధికారులు అగ్రిమెంట్ చేసుకున్నారు. 2023 మార్చి నాటికి పనులు పూర్తిచేయాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. మొదటి భాగంలో రోడ్డును విస్తరింపజేసి డివైడర్ పనులు పూర్తిచేశారు. అదేవిధంగా సెంటర్ లైటింగ్ సిస్టంను కూడా ఏర్పాటు చేశారు. డివైడర్ మధ్యలో మొక్కలు నాటి, సెకెండ్ లేయర్ బీటీ రోడ్డును మాత్రం నిర్మించాల్సి ఉంది.

కొనసాగుతున్న రెండవ భాగం..

పాత బస్టాండ్ నుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు నిర్మించాల్సిన పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఇప్పటికే అగ్రిమెంట్ సమయం పూర్తి కావడంతో కాలపరిమితిని పొడగించాలని కాంట్రాక్టర్ అధికారులకు విన్నవించారు. అయితే ఎప్పటివరకు కాలపరిమితిని పొడగిస్తారనేది ఉన్నతాధికారులపై ఆధార పడింది. పనులు వేగంగా చేపట్టినా అవి పూర్తిచేసేందుకు సుమారు రెండు నెలల సమయం పడుతుంది.

మొక్కల పెంపకంలోనూ ఆలస్యం

డివైడర్‌పై మొక్కలు పెంచి ఆహ్లాదకరంగా మార్చేందుకు అధికారులు రూ.15 లక్షలు నిధులు కేటాయించారు. దీనికోసం కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇంతవరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టలేదు. వర్షాకాలంలో మొక్కలు నాటితే బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు మొక్కలు నాటే పనులే ప్రారంభించలేదు.



పనులు పూర్తయినా వెలగని బల్బులు

ఇబ్బందుల్లో ప్రజలు

రోడ్డు విస్తరణ, డివైడర్, సెంటర్ లైటింగ్ సిస్టం పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు తీయడంతో పాటు రాత్రి సమయంలో వీధిలైట్లు లేకపోవడం ప్రమాదకరంగా మారింది. కొన్ని విద్యుత్ స్తంభాలకు బల్బులు ఏర్పాటు చేయలేదు. సెంటర్ లైటింగ్ పనులు పూర్తి చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది.

రాత్రిపూట ప్రయాణం కష్టంగా ఉంది

రోడ్డు డివైడర్ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నా యి. దీంతో వాహనదారులకు అసౌకర్యంగా ఉంది. సెంటర్ లైటింగ్ ప నులు పూర్తయినా సరే వాటిని వెలిగించకపోవడంతో రాత్రి సమయంలో రోడ్డుపై సరైన వెలుతురు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– తిప్పారెడ్డి, అయిజ

వ్యాపారాలు దెబ్బతింటున్నాయి



రోడ్డు విస్తరణ, డివైడర్ పనులు ఆలస్యం కావడంతో చిరు వ్యాపారుస్తులకు గిరాకీ కావడంలేదు. ఏడాది కావస్తున్నా పనులు కొనసాగిస్తుండడంతో కాలక్రమేనా వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. కరోనా సమయంలో వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. త్వరగా పనులు పూర్తి చేయాలి. – అలీ బాషా, అయిజ

త్వరలో పనులు పూర్తిచేస్తాం



ప్రధాన రోడ్డుపై డివైడర్ పనులతో ప్రజలు కొంతమేరకు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండు నెలల్లో మొత్తం పనులు పూర్తిచేసేందుకు కృషిచేస్తాం.

– గోపాల్, మున్సిపల్ ఏఈ

'బీసీ కులవృత్తుల' సమగ్ర నివేదిక సిద్ధం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: బీసీ కులవృత్తుల వారికి ప్రభుత్వం అందజేసే రూ.లక్ష సాయం కోసం జిల్లా వ్యాప్తంగా 10,959 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. గురువారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వచ్చిన మొత్తం దరఖాస్తులలో 522అనర్హులని, 7652మంది అర్హులుగాను, మరో 2785మందికి సంబంధించి సమగ్ర వివరాలు లేనందున పెండింగులో ఉంచినట్లు తెలిపారు. వీటన్నింటిని సమగ్రంగా తయారు చేసి నివేదిక రూపంలో పంపనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్వేతాప్రియదర్శిని పాల్గొన్నారు.

నూతన కోర్సులను వినియోగించుకోవాలి

స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈవిద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్న నూతన కోర్సులలో విద్యార్థులు ప్రవేశాలు పొంది భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను పొందాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నూతన కోర్సులకు సంబంధించిన ఫ్లెక్సీని విడుదల చేశారు. కార్యక్రమంలో డీఈఓ సిరాజుద్దీన్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వీరారెడ్డి, కాలేజీ అధ్యాపకులు మంజుల, దోస్త్ కోఆర్డినేటర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం

- నియోజకవర్గాల వారీగా జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి
మహబూబ్‌నగర్	ఆర్డీఓ, మహబూబ్‌నగర్
నారాయణపేట	ఆర్డీఓ, నారాయణపేట
జడ్చర్ల	అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ), మహబూబ్‌నగర్
దేవరకద్ర	స్పెషల్ కలెక్టర్, బీమా ప్రాజెక్టు, మహబూబ్‌నగర్
మక్తల్	అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీ), నారాయణపేట
వనపర్తి	అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ), వనపర్తి
గద్వాల	అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీ), గద్వాల
అలంపూర్	ఆర్డీఓ, గద్వాల
నాగర్‌కర్నూల్	ఆర్డీఓ, నాగర్‌కర్నూల్
అచ్చంపేట	ఆర్డీఓ, అచ్చంపేట
కల్వకుర్తి	ఆర్డీఓ, కల్వకుర్తి
కొల్లాపూర్	అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీ), నాగర్‌కర్నూల్
కొడంగల్	అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ), నారాయణపేట
షాద్‌నగర్	ఆర్డీఓ, షాద్‌నగర్

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న వేళ అన్ని నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాలకు అడిషనల్ కలెక్టర్లు, స్పెషల్ కలెక్టర్లు, ఆర్డీఓలకు రిటర్నింగ్ అధికారులుగా, తహసీల్దార్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించారు.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు..

మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి మహబూబ్‌నగర్(అర్బన్), హన్వాడ తహసీల్దార్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. జడ్చర్ల నియోజకవర్గానికి జడ్చర్ల, నవాబుపేట, బాలానగర్, మిడ్జిల్, రాజాపూర్, ఊర్కొండ, దేవరకద్ర నియోజకవర్గానికి దేవరకద్ర, భూత్పూర్, అడ్డకల్, సీసీకుంట, మూసాపేట, కౌకుంట్ల, కొత్తకోట, మదనాపూర్, మక్తల్ నియోజకవర్గానికి మక్తల్, మాగనూర్, నర్వ, ఊట్కూర్, కృష్ణా, ఆత్మకూరు, అమరచింత, వనపర్తి నియోజకవర్గానికి వనపర్తి, పెబ్బేరు, గోపాల్‌పేట్, పెద్దమందడి, ఘనపూర్, శ్రీరంగాపూర్, రేవల్లి, గద్వాల నియోజకవర్గానికి గద్వాల, ధరూర్, మల్దకల్, గట్టు, కేటీదొడ్డి, అలంపూర్ నియోజకవర్గానికి అలంపూర్, అయిజ, ఇటిక్యాల్, వడ్డేపల్లి, మనవపాడు, ఉండవెల్లి, రాజోళి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, తెలకపల్లి, అచ్చంపేట నియోజకవర్గానికి అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, వంగూర్, చారకొండ, పదర, కల్వకుర్తి నియోజకవర్గానికి కల్వకుర్తి, వెల్దండ, తలకొండపల్లి, ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, కొల్లాపూర్ నియోజకవర్గానికి కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, వీపనగండ్ల, పాన్‌గల్, చిన్నంబావి, కొడంగల్ నియోజకవర్గానికి కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్, మద్దూర్, కోస్గి, గుండాల్, కొత్తపల్లి, షాద్‌నగర్ నియోజకవర్గానికి కొందుర్గు, షాద్‌నగర్, కొత్తూర్, కేశంపేట, నందిగామ, చౌదర్‌గూడెం తహసీల్దార్లను నియమించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సద్దలోనిపల్లిలో మాట్లాడుతున్న డీకే అరుణ

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గురువారం మండలంలోని సద్దలోనిపల్లి, మంగంపేట, అడివిరావల్‌చేర్వు, నేతువానిపల్లి, బిజ్వారంలో జెండా అవిష్కరణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదల కోసం రూ.కిలో బియ్యం, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్, బీమా యోజన కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, రామాంజనేయులు, జనార్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

16న సివిల్స్ ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్

గద్వాల: హైదరాబాద్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణ కోసం ఈ నెల 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 08546-293022, 99085 60268 సంప్రదించాలని కోరారు.

ఇద్దరు డీటీలపై సస్పెన్షన్ వేటు

గద్వాల రూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు డీటీలపై కలెక్టర్ వల్లూరు క్రాంతి సస్పెన్షన్ వేటు వేయడం జిల్లాలో చర్చనీయంశమైంది. పూర్తి వివరాలిలా.. అలంపూర్ మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న శివకుమార్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విషయాన్ని సంబంధిత తహసీల్దార్ సుభాష్‌నాయుడు కలెక్టర్ క్రాంతికి రిపోర్ట్ రాశారు. అదే విధంగా గద్వాల మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణరెడ్డి ఎన్నికలకు సంబంధించి నివేదికల తయారీలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు డీటీలపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రాజాపూర్: బతుకుదెరువు కోసం వచ్చి విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బుడేనా గ్రామానికి చెందిన సుమిత్రాబాయి, జగదీష్‌యాదవ్‌లు ఇద్దరు కుమారులు పరదేశియాదవ్ (38), విదేశియాదవ్‌తో కూలీ పని చేసేందుకు రెండు రోజుల క్రితం వచ్చారు. తిర్మలాపూర్ శివారులోని స్వర్గసీమ వెంచర్‌లో తాత్కాలిక రేకులషెడ్ ఏర్పాటు చేసుకోని కరెంట్ కనెక్షన్ ఇస్తుండగా పరదేశియాదవ్‌కు ఛాతిపై విద్యుత్ వైర్లు పడి విద్యుదాఘానికి గురయ్యాడు. వెంటనే అతన్ని తోటి కూలీలు జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సుమిత్రాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడు..

గద్వాల క్రైం: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం గద్వాల శివారులో చోటుచేసుకుంది. బంధువుల, స్నేహితుల కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన కుర్వ నరేష్(23) హైదరాబాద్‌లో నివాసం ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. అతను కొన్ని రోజుల క్రితం ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా బైక్ కొన్నాడు. ఆర్థిక సమస్యల వల్ల ఫైనాన్స్ చెల్లించడంలో జాప్యం చేశాడు. ఈ విషయమై స్నేహితులకు చెప్పి ఎక్కడైనా అప్పు తీసుకుందామని ఈనెల 12న గద్వాలకు వచ్చాడు. స్నేహితులను కలిసి చీకటి పడడంతో స్నేహితుడు సెక్యూరిటీగా పనిచేసే జమిచెడ్ వద్ద రైస్ మిల్లుకు వెళ్లాడు. స్నేహితులంతా కలిసి మద్యం తాగారు. తెల్లవారు జామున స్నేహితులు లేసి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటికి వెళ్లారు. ఈ క్రమంలో కుర్వ నరేష్ సెక్యూరిటీ రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. బయటనుంచి వచ్చిన స్నేహితులు వెంటనే అతన్ని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ విషయం వైద్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్‌ఐ ఆనంద్ అక్కడికి చేరుకున్నాడు. నరేష్ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కన్నీరు మున్నీరయ్యారు. కొడుకు మృతిపై అనుమానం ఉందని, తండ్రి కుర్వ నర్సింహులు ఫిర్యాదు చేశాడు. నరేష్ స్నేహితులను అదుపులోకి తీసుకోని విచారించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని అమడబాకుల శివారులో ఉన్న సాయి రెస్టారెంట్ సమీపంలో బుధవారం సాయంత్రం కాలినడకన వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరితో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న అమడబాకుల సర్పంచ్ బుచ్చన్న ముగ్గురిని అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాలినడకన వెళ్తున్న వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వివాహిత..


లక్ష్మి (ఫైల్)

ఆత్మకూర్: జీవితంపై విరక్తి చెంది ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న మహిళ చికిత్స పొందుతూ గురువారం ఉస్మానియా ఆస్పత్రిలో మృతి చెందింది. ఎస్సై నరేందర్ వివరాల ప్రకారం.. ఆత్మకూర్ పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన పీనం ఎల్లప్ప, సంధ్య(లక్ష్మి) దంపతులకు ఇద్దరు పిల్లలు. అన్యోన్యంగా ఉన్న వారి వైవాహిక జీవితంలో గొడవలు మొదలయ్యాయి. దీంతో గత నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో సంధ్య ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది మంటలకు తాలలేక కేకలు వేయడంతో గమనించిన కుటుంబసభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆమె మృతి చెందింది. ఆమె తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తికి గాయాలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి కిందపడి వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మూస మల్లేష్ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పార్థాలు రావడంతో భార్యకు, పిల్లలకు దూరంగా కూలీ పనిచేస్తూ మల్లేష్ అమిస్తాపూర్‌లో నివసిస్తున్నాడు. గురువారం ఉదయం అమిస్తాపూర్ సమీపంలోని బ్రిడ్జి కింద గాయాలతో పడి ఉన్న మల్లేష్‌కు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి ఆయన్ను తరలించారు. బుధవారం రాత్రి బ్రిడ్జిపై నుంచి ప్రమాదశాత్తు కింద పడిపోయి ఉండొచ్చని, రాత్రి కావడంతో గుర్తించలేకపోయారు. రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అమిస్తాపూర్‌లో మల్లేష్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద పోలీసులు విచారణ చేయగా భార్య అలివేలు, కూతురు, కుమారుడు ఉన్నట్లు గుర్తించారు. దీంతో భార్యకు సమాచారం ఇచ్చారు.

ఇంటింటికో టులెట్ బోర్డు

- జడ్చర్లలో పడిపోయిన ఇంటి అద్దెలు
- అధికంగా ఇళ్ల నిర్మాణంతోనే..
- భారీ అపార్ట్‌మెంట్లు నిర్మించడం కూడా కారణం



వెంకటేశ్వరకాలనీలో ఇంటిముందు టులెట్ బోర్డు

జడ్చర్ల: ఒకప్పుడు అద్దెకు ఇళ్లు దొరకని పరిస్థితి. ప్రస్తుతం పట్టణంలో ప్రతి ఇంటికి టులెట్ బోర్డు వేలాడుతుందంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు. నెలల తరబడి ఇళ్లు ఖాళీగా ఉండడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ భూములు అమ్మి, మరికొందరు బ్యాంకు రుణాలను తీసుకుని ఇళ్లు నిర్మించారు. అద్దెలు వస్తే రుణాలు చెల్లించుకునే వారి ఆలోచన తలకిందులైంది. ఇళ్లు ఖాళీ అవుతుండడంతో బ్యాంకు రుణాలు, విద్యుత్ చార్జీలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

కుటుంబాల కంటే ఇళ్లే అధికం

పట్టణంలో నివసించే కుటుంబాల సంఖ్య కంటే అధికంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కేవలం అద్దెల కోసమే భారీ ఇళ్లను నిర్మించారు. కనీసంగా రెండు నుంచి ఐదు అంతస్తుల వరకు భవనాలను నిర్మించారు. ఒక్కో ఇంటిలో ఐదు నుంచి 20 సింగిల్‌బెడ్ రూమ్ పోర్షన్లు ఉన్నాయి. దీనికి తోడు ఇటీవల భారీగా అపార్ట్‌మెంట్లను నిర్మించడంతో వందలాది కుటుంబాలు అపార్ట్‌మెంట్లలోకి మారారు. పట్టణంలో దాదాపుగా 26వేల కుటుంబాలు నివసిస్తున్నట్లు అంచనా.

ఖాళీగా ఉన్న కాలనీలు

పట్టణంలోని పద్మావతి కాలనీ, విద్యానగర్, గౌరీశంకర్ కాలనీ, సరస్వతీనగర్, వెంకటేశ్వర కాలనీ, సత్యనారాయణ స్వామి కాలనీ, లక్ష్మి నగర్, విజయనగర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు, అయ్యప్ప కాలనీలో ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. చాలా చోట్ల టులెట్ బోర్డులు వేలాడుతున్నాయి.

పరిశ్రమలే ఆధారం

పట్టణంలో ఇంటి అద్దెలు, ఇతర ఉపాధి మార్గాలకు ప్రధానంగా పరిశ్రమలు ఉండడమే కారణం. పోలేపల్లి సెజ్‌లో వేలాదిమంది ఉద్యోగులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్నారు. వీరికి ఉండేందుకు అందుబాటులో పట్టణం మాత్రమే అనువుగా ఉంది. ఇటీవల పలు పరిశ్రమల యజమానులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, షాద్‌నగర ప్రాంతాలకు నేరుగా కంపెనీల నుంచి బస్సులు ఏర్పాటు చేయడంతో చాలా మంది పట్టణం నుంచి తమ మకాంలను మార్చారు. అంతేగాక కొత్త పరిశ్రమలు రాకపోవడం కూడా కొంత కారణంగా ఉంది.

పడిపోయిన అద్దెలు

ఇళ్ల అద్దెలు భారీగా పడిపోయాయి. గతంలో డబుల్ బెడ్రూం రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.7వేలు ఉంది. సింగిల్ బెడ్రూం అద్దెలు రూ.6వేలకు పైబడి ఉండగా ఇప్పుడు దిగువకు వచ్చాయి.

ఏడాదిగా ఖాళీ..



మా ఇంట్లో 10 సింగిల్ బెడ్రూం పోర్షన్లు ఉన్నాయి. వ్యవసాయ భూమి అమ్ముకుని ఇల్లు కట్టుకున్నాను. ఏడాది కాలంగా ఎప్పుడూ రెండు, మూడు పోర్షన్లు ఖాళీగా ఉంటున్నాయి. పోలేపల్లి సెజ్ ఉద్యోగులు, సిబ్బంది స్థానికంగా ఉండడం లేదు.

–వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర కాలనీ, జడ్చర్ల

రెండు పోర్షన్లు ఖాళీ



మా ఇంట్లో 8 సింగిల్ బెడ్ రూమ్ పోర్షన్లు ఉన్నాయి. మూడు నెలలుగా రెండు పోర్షన్లు ఖాళీగా ఉన్నాయి. ఇల్లు అద్దెకు అడిగే వారి సంఖ్య తక్కువగా ఉంది. జడ్చర్ల ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మళ్లీ ఇళ్ల అద్దెకు డిమాండ్ వచ్చే పరిస్థితి ఉంది.

–నర్సింహులు, పద్మావతీ కాలనీ, జడ్చర్ల

నేడు శాకాంబరిగా జోగుళాంబదేవి


శాకాంబరిదేవి అలంకరణకు కూరగాయాల దండ తయారు చేస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారు ఆషాడ మాస చివరి శుక్రవారం శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జోగుళాంబ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అలంకరణకు కూరగాయలు, పూలు పండ్లు అందజేశారు. ప్రతి ఏటా ఆషాడమాసంలో చివరి శుక్రవారం భక్తులకు జోగుళాంబ అమ్మవారు శాకాంబరిదేవిగా దర్శనమిస్తారని తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

బిజినేపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. యువకుడి ఇంటి దగ్గరలో నివాసం ఉంటున్న పదేళ్ల పాపకు మాయమాటలు చెప్పి బుధవారం రాత్రి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తప్పించుకొని పోయి కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో గురువారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాములుయాదవ్ తెలిపారు.

పులి కాదు.. అడవి పెద్దపిల్లి



అయిజ: మండలంలోని దేవబండ గ్రామ శివారులో బుధవారం రాత్రి పులి సంచరించినట్లు, కొంతమంది అది చూసినట్లు పుట్టిన పుకార్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అది ప్రజలను కలవరపాటుకు గురిచేసింది. గ్రామస్తులు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరీక్షించారు. ఆ ప్రదేశంలో ఉన్న జాడలు పులివి కాదని, అడవి పెద్ద పిల్లివని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో అటవీ శాఖ బీట్ అధికారి వాజీద్, స్థానిక ఎస్‌ఐ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


చిన్నమొగులయ్య (ఫైల్)

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): అప్పులబాధతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన హన్వాడ మండల పరిధిలోని షేక్‌పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గంగరాజు చిన్నమొగులయ్య(60) తనకున్న నాలుగెకరాల పొలంలో కొంత బాగం కూరగాయలు పండిస్తూ, మిగతా పొలాన్ని వరి సాగుచేసేవాడు. పెట్టుబడి కోసం రూ.1.5లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చలేక ఈ నెల 9వ తేదీన ఎప్పటిలాగే పొలానికి వెళ్లాడు. అక్కడే పురుగుల మందు తాగి అపస్మరక స్థితికి వెళ్లడం గమనించిన చుట్టు పొలాల వారు వెంటనే అతన్ని మహబూబ్‌నగర్ జిల్లా అస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మొగులయ్య మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొగాకుతో అనారోగ్య సమస్యలు


అవగాహన బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పాలమూరు: పొగ తాగడం యువత ఫ్యాషన్‌గా భావించి అలవాటు చేసుకుంటున్నారని, ఇది ఒక రకంగా డబ్బులు ఇచ్చి జబ్బులు తెచ్చుకోవడమేనని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. సిగరేట్, పొగాకు ఉత్పత్తుల నిషేధచట్టం 2003పై గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. పొగ తాగడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన పెంచాలన్నారు. సినిమాలలో చూసి పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులు వీటిని అలవాటు చేసుకుంటున్నారన్నారు. రైతులకు పొగాకు పంటలకు బదులుగా ఇతర పంటలు పండించేలా ప్రోత్సాహించాలన్నారు. చిన్నచింతకుంట మండలంలో తయారవుతున్న బీడీ కట్టాలపై తప్పకుండా పుర్రె బొమ్మలు ఉండేటట్లు చూడాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో పొగాకు తాగడం వల్ల కలిగే నష్టంపై ఫ్లెక్సీబోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్యశాఖతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పొగాకు వాడకాన్ని నిలువరించాలన్నారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులలో రూ.6.80లక్షల వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, సంధ్యాకిరణ్మయి, డాక్టర్ కిశోర్, శ్రావణ్ పాల్గొన్నారు.

కొండ చిలువను చంపిన గ్రామస్తులు



మక్తల్: మండలంలోని గుడిగండ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం కొండ చిలువ సంచరించింది. దీంతో స్థానిక మహిళలు కేకలు వేయడంతో కొందరు యువకులు దాన్ని కర్రలతో చంపేశారు. ఇళ్ల మధ్యన పాములు అధికంగా వస్తున్నాయని కాలనీవాసులు వాపోయారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


కలెక్టర్‌బంగ్లా చౌరస్తా సమీపంలో విరిగిపడిన చెట్టు కొమ్మలు


తెలంగాణ చౌరస్తా వద్ద కురుస్తున్న వర్షం

- పాలమూరులో పలుచోట్ల విరిగిపడిన చెట్ల కొమ్మలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మొదట ఉరుములు, మెరుపులతో ఆరంభమై అర గంట పాటు ఏకధాటిగా కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కలెక్టర్‌బంగ్లా చౌరస్తాతో పాటు పలుచోట్ల చెట్టు పెద్ద కొమ్మలు విరిగి పడగా మున్సిపల్ సిబ్బంది, స్థానికులు తొలగించారు. గతంలో పెద్దచెరువు చుట్టూ వరద కాల్వ తవ్వారు. దాని ద్వారా వచ్చే ప్లాస్టిక్ వస్తువులు, మురుగు అందులో చేరకుండా తాజాగా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. రామయ్యబౌలి, న్యూటౌన్ ప్రాంతాల్లో పెద్ద జాలీలు ఉండటంతో చెత్తాచెదారం అక్కడి వరకు వచ్చి ఆగిపోగా పెద్ద చెరువులో కలవకుండా మున్సిపల్ కార్మికులు తొలగించారు. కాగా, మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం పర్యవేక్షించారు.

రైతులకు మేలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలోని బాలానగర్, మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, కోయిలకొండ, హన్వాడ, గండీడ్, అడ్డాకుల, కౌకుంట్ల మండలాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుతం వేసిన పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు అంతంత మాత్రం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. బోర్లు, బావుల వద్ద నాట్లు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు.


పెద్దచెరువు వద్ద రామయ్యబౌలి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్

పత్తి రైతులకు కుచ్చుటోపీ

- రూ.3కోట్లకుపైగా చెల్లించకుండా వ్యాపారి పరార్

దామరగిద్ద: పత్తి పంటన అధిక రేటు ఆశ జూపి వారితో కొనుగోలు చేసి డబ్బుల చెల్లించకుండా పరారైన వ్యాపారి బాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత రైతులు, స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వత్తుగుండ్లకు చెందిన శివకుమార్ పత్తి కొనుగోలు వ్యాపారం చేసేవాడు. గత డిసెంబర్, జనవరి నెలల్లో మండలంలోని విఠలాపూర్ చెందిన గుట్టలి చెన్నప్ప సహా మరో ఏడుగురు రైతులు, ఆశన్‌పల్లి, లక్ష్మీపూర్‌లో మొత్తం పది మంది రైతుల నుంచి పత్తి కొనుగోలు చేశాడు. వారికి ఇవ్వాల్సిన రూ.10 లక్షలకు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. వీరితో పాటు కొడంగల్, కోస్గి, దౌల్తాబాద్, కర్ణాటకలోని పలు గ్రామాల్లో మొత్తం 60 మందికి పైగా రైతులకు దాదాపు రూ.3 కోట్లు విలువైన పత్తి తీసుకుని డబ్బులు చెల్లించకుండా కనిపించకుండా పోయాడు. విఠలాపూర్‌కు చెందిన రైతు, వ్యాపారి భార్యా, పిల్లలను కర్ణాటక రాష్ట్రం సేడంలో ఉంచి భర్త ఆచూకీ కోసం వాకాబు చేశారు. దీంతో సదురు వ్యాపారి తన భార్యా పిల్లలను కిడ్నాప్ చేశారంటు తన మామ చేత నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాడు. పోలీసులు విచారణ చేస్తూ వ్యాపారి నంద్యాలలో ఉన్నట్లు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో పలువురు బాధిత రైతులకు విషయం తెలియడంతో స్టేషన్‌కు వచ్చి సదురు వ్యాపారి బాగోతాన్ని బయటపెట్టారు. తమ నుంచి పత్తి కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వలేదని వత్తుగుండ్లకు చెందిన రైతు చెన్నప్ప ఫిర్యాదు చేశారు. దీంతో దామరగిద్ద పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని శుక్రవారం రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి పైకప్పు కూలిపడి తండ్రీ కూతురికి గాయాలు


కూలిన ఇంటి పైకప్పు


గాయాలపాలైన చిన్నారి శీదేవి

దామరగిద్ద: బండలతో నిర్మించిన ఇంటి పైకప్పు కూలిపడడంతో తండ్రీ కూతురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని బాపన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. బాపన్‌పల్లి గ్రామానికి చెందిన ఉషపోళ్ల పాండు కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి ఇంట్లోనే నిద్రిస్తున్నారు. ఇంటి వాసాలు తుప్పు పట్టడంతో 11 గంటల సమయంలో ఒక్కసారిగా విరిగి పడ్డాయి. పాండు భార్య వెంటనే తేరుకొని రాగా, పాండు కూతురు శ్రీదేవి పై బండలు పడ్డాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. కూతురు పరిస్థితి విషమంగా ఉండడంతో నీమ్స్‌కు తీసుకెళ్లారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ సత్యమ్మ తిప్పన్న, ఎంపీటీసీ లక్ష్మీ చంద్రశేఖర్‌లు కోరారు.

విగ్రహావిష్కరణకు అందరూ కలిసిరావాలి

- పండుగ సాయన్న సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ


మాట్లాడుతున్న పండుగసాయన్న సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బహుజన వీరుడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణకు సమన్వయంతో అందరూ కలిసి రావాలని పండుగ సాయన్న సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం హన్వాడ మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ముదిరాజ్ సంఘాల జేఏసీ నాయకులతో సమావేశమై పండుగ సాయన్న జయంతి, విగ్రహావిష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు వర్గాల అభివృద్ధి కోసం పనిచేసిన పండుగ సాయన్న చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. పాలమూరులో పుట్టిన పండుగ సాయన్న పల్లె పల్లెన పాటల రూపంలో సుపరిచితులైనా కనీసం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోలేకపోడవం దురదృష్టకరమన్నారు. ఈ నెల 23న పండుగ సాయన్న జయంతి సందర్భంగా పాలమూరు పట్టణంలో గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేయనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలగోపి, రామకృష్ణ, పిట్ల కేశవులు, మేకల శివ, శ్రీను, మల్లేష్, రవికుమార్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

జిల్దార్‌తిప్పను సందర్శించిన కలెక్టర్


చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని నల్లమల అడవి సమీపంలోని జిల్దార్‌తిప్ప చెరువు, దోమటిజాల్‌ను కలెక్టర్ ఉదయ్‌కుమార్ గురువారం సందర్శించారు. అక్కడున్న అడవి పరిసరాలను, బేష్ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. చెరువు ఆయకట్టు గురించి స్థానిక తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా రేంజర్ అడవిలో ఎనిమిది పులులు ఉన్నట్లు తెలిపారు, కెమోరాలు అమర్చిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు, అక్కడున్న ఫారెస్టు, రెవెన్యూ సరిహద్దులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరామ్, ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి, ఫారెస్టు సిబ్బంది ఉన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

పాలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాద రక్షణ చట్టం అమల్లోకి తీసుకువచ్చి, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కోస్గి న్యాయమూర్తి కారుతో పాటు ఆమె భర్త హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న శశికిరణ్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరిపైనను దాడి జరిగితే న్యాయవాదులు రక్షిస్తారని, తమపై దాడులు చేస్తే ఏం చేయాలన్నారు.

చోరీ కేసులో జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: చోరీల కేసులో ఓ వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చోరీ కేసుల్లో మహారాష్ట్రకు చెందిన అక్షయ్ శ్రీమంత్ అనే వ్యక్తిని గురువారం జిల్లా కోర్టులో హాజరుపరిచారు. మహబూబ్‌నగర్ నాలుగో అదనపు న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి దొంగకు ఒక్కో కేసులో రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో పీపీ విశ్వరేఖ వాదనాలు వినిపించారు. జైలుశిక్ష పడిన వ్యక్తిని పోలీసులు జిల్లా జైలకు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

రెండు ఇళ్లలో చోరీ

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్‌లో బుధవారం రాత్రి రెండు ఇళ్లలో దొంగలు చొరబడి నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాగరాజు పని నిమిత్తం బుధవారం ఉదయం కర్ణాటకలోని రాయచూరుకు వెళ్లగా భార్య ఉమామహేశ్వరి రాత్రి గ్రామంలో ఉండే తల్లి వద్దకు వెళ్లింది. గురువారం ఉదయం ఉమామహేశ్వరి ఇంటికి వచ్చి చూడగా తలుపు పగలగొట్టి కనిపించాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 13 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 9 తులాల వెండి గొలుసులు కనిపించలేదు. అలాగే అదే ఇంటి ఎదుట ఉన్న నాగమణి కూడా ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించి అందులోకి చొరబడి బీరువా పగులగొట్టి తులం బంగారు చైను, 3 తులాల వెండి ఆభరణాలు, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

● యంగ్ టాలెంట్

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది దిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. దిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. దిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'



సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.



● సక్సెస్ స్టోరీ

తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్



స్టార్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

యువర్స్

● టెక్.. టాక్

హువావే నోవా 11 ప్రో



● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హార్మని ఓఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్



నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్

● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినీయం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేబెట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల

వస్తున్నారహో!



ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్



పూజా హెగ్డే

● రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి. పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశితో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.



అనుష్కా శర్మ



కియారా అద్వానీ

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.



కత్రినా కైఫ్



● ప్రియాంకా చోప్రా



● ఆలియా భట్

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.



● మీనాక్షీ చౌదరి

● శ్రీలీల



● 'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. "తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం" అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ



● విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ



● అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. "జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది" అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయుర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. "ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.



● సయ్యద్ సోహైల్, రూపా కొడవాయుర్

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

- ఉదయనిధి స్టాలిన్



"'నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది" అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ–"తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను" అన్నారు.